# సుందరీవా!దరీవా

'ఒరేయ్, దీన్ని చేసుకుంటావురా?'

'చేసుకొని ఏంచేసుకోను' అనిపించిందేమో ఊహూ అన్నట్లుగా తలాడించాడు. బూరెబుగ్గలు, చక్రాల్లాంటి కళ్ళు, చింపిరిజుట్టు, దువ్వెనకు లొంగదు. 'ఎందుకురా చేసుకోవు?' పచ్చిబాలింత నవ్వుతోంది. పచ్చి పసుపుకొమ్ము విరిచిన రంగులా వుందానవ్వు.

'ఏడుత్తోంది అత్తా!' అని చెప్పాడు కృష్ణుడు. దగ్గరికి రాలేదు. ముక్కు చిట్లించాడు.

'ఎత్తుకుంటావురా?'

'ఏక్కు, ఆఁవదం.'

'ఎంతముద్దొస్తూందో. అట్లా అంటావేమిటిరా వెధవా. చూడు ఆ నోరు లక్కపిడత. ఆ కళ్ళు చూడు. అప్పుడే ఎంత జుట్టో.' అమ్మ మురుస్తోంది.

కృష్ణుడి కవేవీ తెలియవు. పది రోజుల నుంచీ అత్తను చూడ లేదు వాడు. అత్త చాలా మంచిది. తాను వాళ్ళింటి కెళ్ళినప్పుడల్లా నువ్వుండో, వేరుశనగ పాకో, ఏంలేకపోతే బెల్లం ముక్కయినా పెట్ట కుండా వుండదు. అత్తంటే తన కందుకే ఇష్టం. మామయ్య తనని ఏవిటేవిటో వాగిస్తాడు. తాను తనకు తెలిసీ తెలియని విషయాలన్నీ నడ్డిమీద చేతులు పెట్టుకుని ఆరిందాలాగా గల గల లాడిస్తుంటే అత్తా మామా ఒకటే నవ్వు. 'ఇక నీ ఆటలేవీ అక్కడ సాగవు' అన్నది అమ్మ ఓ రోజు పొద్దున్నే తనకు చద్దన్నంపెడుతూ.

తెల్లబోయినట్లు అమాయకంగా చూశాడు అమ్మ మొహంలోకి. అమ్మకీ ముద్దొచ్చింది. అసలే తెల్లనిపళ్ళు. ఆ తెల్లని పళ్ళమీద పెరుగన్నం పెదాల్ని కూడా తెలుపు చేస్తున్నది.

'అత్తకోబుజ్జి పాపాయి పుట్టిందిగా. ఇక నీ వెళ్ళి వాళ్ళో కూచుంటే ఆ పిల్ల ఊర్కోదు' అంది అమ్మ. కృష్ణుడికి తెలిసినట్లు నవ్వాడు. "కృష్ణుడూ, అటుపోకు. నిన్నెవళ్లూ పోనివ్వరు అత్తదగ్గరికి."

"ఏం ఎందుకు పోకూడదు?"

"అత్త నీళ్ళు పోసుకున్న రోజున మనందర్నీ భోజనానికి పిలుస్తారు. అప్పటిదాకా అత్తని నీవు చూసేందుకులేదు."

ఈ పది రోజులూ పదియుగాలుగా గడిచాయి. గుడికి పోయినా బడికి పోయినా, అమ్మతో కలిసి నీళ్ళు తేవడానికి పోయినా, అలివేలత్తను గురించే ఆలోచించేవాడు కృష్ణుడు.

'నీకోసం కబురుచేసింది అత్త. వెళ్ళు' అన్నది అమ్మ పొద్దున్న నీళ్ళుపోస్తూ.

పండక్కి కొత్తచొక్కా కుట్టించుకున్నంత సంబరపడిపోయాడు కృష్ణుడు.

'తుడుచుకోకుండానే, చెడ్డీవేసుకోకుండానే వెళ్ళిపోతావుట్రా?'

వీధి చివరన తల్లి అరుపు విని చెంగనాలేసే కోడెదూడలా గింజుకున్నాడు కృష్ణుడు.

"అబ్బ వుండరా, వెంకి వెధవా; ఈ దిస్సమొలతో వెళ్ళావంటే ఆ పిల్ల నిన్ను వెక్కిరిస్తుంది."

ఎవరాపిల్ల! ఎక్కణ్ణించి తెచ్చుకుంది అలివేలత్త. ఇక తనని ముద్దెట్టుకోదా. పండక్కి కొత్త లాగూ చొక్కా కుట్టించదా.

వెళ్ళి చూశాడు కృష్ణుడు. తాంబూలం వేసుకొంటోంది అత్త. ఏవిటో వాసన గదిలో. ఎల్లిపాయల వాసన. ఆముదం వాసన.

అదుగో అలా మొదటిసారి చూశాడు కృష్ణుడు. చూస్తూ చూస్తూ వుండగానే అడిగింది అత్త- మా మాణిక్యాన్ని చేసుకోరా-అని.

సరదాకని అంది కాబోలు. లేకపోతే తనంటే ఇష్టంకదూ-అందు కని అంది కాబోలు. 'కాని నీవొక మసిపాతవు. నీకు చదువు లేదు. సంధ్య లేదు. ఆస్తిలేదు. దర్జా లేదు. హోదా లేదు. ఉద్యోగం లేదు. మా నాన్న తాసిల్దారు. మా ఆయన జమీందారు' అనుకోలేదేమో అప్పుడు.

'అల్లా వారింటికి చల్లకుపోతే

అల్లావారి కుక్క- భౌవ్వుమనె

నా ఒళ్ళు ఝల్లుమనె-' అని రోజూ చదివించి చిన్న చేతుల చిన్న వేళ్లతో చేతులూ కళ్ళూతిప్పి చదువుతుంటే ఎంతో ఆనందించే అలివేలత్త-పదహారేళ్ళ తర్వాత ఏం జరిగేదీ చూడలేకపోయివుంటుంది. ఇది జీవితం కదా-జీవితంలో ముందేం జరగబోయేదీ నిక్కచ్చిగా ఎవరు చెపుతారు? ఎవరూ చెప్పలేరు.

మాణిక్యమంటే కృష్ణుడికి వల్లమాలిన మాలిమి. తనకన్నా ఏడెనిమిదేళ్లూ చిన్నేమో, తానేమో పెద్ద ఆరిందాలా ఆ పిల్ల బాగోగులన్నీ కనిపెట్టి చూస్తూ వుండేవాడు. అత్త కూడా మాణిక్యం విషయంలో ఏ పుస్తకం కావాలన్నా, ఏ సరదా తీరాలన్నా తనకే పురమాయిస్తూ వుండేది. ఆ పిల్ల ఒక్కొక్క రేక విచ్చుకుంటున్న బంతిపువ్వులా కలకలాడుతూ ఎదిగింది.

మాణిక్యాన్ని బళ్లోవేసిన రోజున కృష్ణుడికి పండగే. తనకి కొత్త చొక్కా లాగూ వొచ్చాయి. తనతోటే ఎప్పుడూ వుంటూవుండేదా పిల్ల. తమ ఇంట్లోనే పొద్దస్తమానమూ ఆడుకునేది.

'ఏమిరా యింత ఇదయిపోతున్నావు. మా పిల్లను చేసుకుంటావా?' అనేది అత్త.

ఏమీ అర్థంకానట్లు అమాయకంగా నవ్వేవాడు కృష్ణుడు. ఎప్పుడయినా అమ్మ విన్నప్పుడు మాత్రం 'మీరు మాకు అందుతారా వదినా?' అనేది.

ఎనిమిదేళ్ళదైంది. పన్నెండేళ్ళదయింది మాణిక్యం.

ఎనిమిదో ఏట మాణిక్యానికో తమ్ముడు పుట్టాడు. తనతో నేస్తం మానేసింది. క్రమక్రమంగా తగిగ్గస్తూ వచ్చింది. కృష్ణుడు చిన్నబుచ్చుకునేవాడు. కాని, అమ్మ చెప్పే కారణాలు సబబుగానే కన్పించేవి. 'పెద్దది కావటంలా?! అయినా నాయనా నీ పిచ్చిగాని మాణిక్యం మన పిల్లయిపోతుందటరా?'

ఎందుకుకాదు అని అడగాలనివుండేది కృష్ణుడికి. కాని, అమ్మ కాదని చెపుతున్నది కదా....కామోసు అనుకునేవాడు.

కోలమొహం. తీర్చినకళ్ళు. నవ్వితే ముక్కు మొహమూ కళ్లూ ఆఖరుకు చెవులదాకా ఆ నవ్వు నవ్వుతున్నట్లే వుండేది. ఏదైనా ప్రత్యేకించి చెప్పాల్సి వచ్చినప్పుడు మెడ అదొక అందంగా వంచి కనుకొలకుల్లోంచి మాట్లాడేది మాణిక్యం. మాట్లాడటం ముగించినా పెదవుల మీద ఆ నవ్వు అలానే వుండిపోయేది. నవ్వులోనూ బిడియమే, బిడియంలోనూ నవ్వే. ఏమిటో ఇంత ఎడంగా వుండటం అంటూ బాధపడిపోయేవాడు. కాని పద్దెనిమిది పంతొమ్మిది ఏళ్ళు సాగుతూవుండగా ఆ ఎడం అర్థమైంది. ఇక ఎలా చెట్టపట్టాలు! శివాలయం ఆవరణలో పచ్చగన్నేరు పూలు లేత చేతులకి అందకపోతే విల్లులా వంగి వీపు మీద ఎక్కి కోసుకోమనటంకాని, నడుందగ్గర వాటంగా రెండు చేతులు చుట్టి తన ఎత్తును ఇంకాస్త పెంచి ఆ పూలు తానే కోస్తున్నంత సంబరపడటం కానీ ఇక సాగుతుందా?

ఓ రోజున ఆ వీధి వీధంతా గాబరా పడిపోయారు. కాళ్ళు తొక్కుకున్నారు. చేతులు పిసుక్కున్నారు. ముఖాలు వేలేసుకున్నారు. క్షణక్షణం ఆత్రంగా ఎదురు చూశారు. మాణిక్యానికి పద్నాలుగో ఏడో పదిహేనో ఏడో జరుగుతోంది. టవున్‌కి వైద్యుడి కోసం కబురు వెళ్ళింది. తండ్రి గారు ఊళ్లో లేరు. మద్రాసులో ఏదో సభలని వెళ్ళారు. ఎవరో ముసలమ్మ చెప్పింది. ఆకుజెముడు సెగ తగిల్చి పసరు పిండాలని ముక్కుల్లో. కృష్ణుడు పరిగెత్తుకుని వెళ్ళాడు. ఊరవతల పాడుపడిన కోటలో పగటి పూటే పోవడానికి భయపడే చోటు చీకట్లు ముసురుకున్న తర్వాత కృష్ణుడు వెళ్ళి తెచ్చాడు. ఆ ముసలమ్మే వైద్యం చేసింది. మాణిక్యం కళ్ళు విప్పి చూసింది. అత్త కృష్ణుణ్ణి ఎంతగానో దీవించింది.

కార్తీకమాసం నెల రోజులూ శివాలయంలో కోలాహలంగా వుండేది. ఊరి కల్లంతదూరంలో వున్న నదినుంచి నీరు తెచ్చి అభిషేకాలు చేసేవారు. కార్తీక పున్నమకు ఊళ్లో సంబరం జరిగేది. సంత సాగేది. ఏనుగంబారి ఎక్కి ఎవరో స్వాములవారు వస్తూ వుండేవారు. రాత్రిళ్లు పూజలు, ప్రసాదాలు, పురాణాలు, చిత్ర విచిత్రమైన దీపోత్సవాలు, అమ్మవారికి అలంకారాలు, దశావతారాలు రంగురంగు లద్ది మట్టితో తయారుచేసేవాళ్ళు

మాణిక్యం రోజూ గుళ్లో హాజరు. బుద్ధిమంతురాలుగా ముందు వరసలో కూచునేది. కాని ఎప్పుడు కళ్ళు వీపువైపే. తాను మంటపం మీద కూచునేవాడు. ఎప్పుడైనా కళ్ళు కలుసుకునేవి. ముక్తసరి పలకరింపులు.

మాణిక్యానికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారుట. తాను పై చదువులకు వేరే ఊళ్లో ఉండే స్తోమత లేదు. స్కూల్ ఫైనల్ పాసయినాడు. అదీ మొదటిసారి కాదు, రెండోసారి. తండ్రి వైద్యం చేస్తాడు. ఊళ్లో పిల్లలకి చదువు చెపుతాడు. తననీ చెప్పమంటాడు.

తాను నదిలో గంటల తరబడి ఈదులాడుతుంటాడు. ఊళ్లో గ్రంథాలయంలోకి వెళ్ళి పత్రికలన్నీ చదువుతాడు. కొత్త పుస్తకాలు రాకపోతే చదివినవే చదువుతాడు. మాణిక్యానికి సంబంధం కుదిరింది. వాళ్ళవి లంకల్లో పొలాలుట. తోటలుట. మామిడి తోటలు, కొబ్బరి తోటలు. బి.ఎ. చదువుతున్నాడుట పెళ్ళికొడుకు.

తాను చదవగలడా బి. ఎ.?! తనను గురించి మాణిక్యం ఏమనుకుంటుందో!

తాను చూసీ చూడనట్లు చూస్తుండగానే పెళ్లి ముస్తాబులన్నీ సాగిపోయినయ్ ఆలయంలో అమ్మవారికి అలంకారాలు చేస్తున్నంత హడావుడి చేశారు. తానూ భోజనానికి వెళ్ళాడు. అప్పుడు చూశాడు పెళ్ళికొడుకుని. తనకన్నా ఏంబాగున్నాడు ! ఆ మాట ఎవరితో అంటాడు?! మగవాడికి అందం అక్కర్లేదుట. అమ్మలక్కల సిద్ధాంతం.

అలివేలత్త తనకేదో పనులు పురమాయించి ఆజ్ఞాపిస్తుంటే కోపం వచ్చేది. అభిమానం కలిగేది. కాని ఆమె ముఖమంతా ఆప్యాయత నింపుకొని మాట్లాడినప్పుడు జాలి కలిగేది. ప్రేమ కలిగేది.

మాణిక్యం అత్తవారింటి కెళ్ళిపోయింది అందరిలాగే. మాణిక్యం తమ్ముడికి తొమ్మిదో ఏడు వచ్చింది. మాణిక్యం తల్లిదండ్రులు కూడా పట్నం వెళ్ళిపోయారు.

* * *

'మద్రాసీ హోటలుంది, అక్కడకు వెళ్ళండి' అని అర్థమయీ కాని హిందీలో చెప్పాడు రిక్షా అతను. ఎన్నెన్నో అడగాలి. ఏవిటేవిటో తెలుసుకోవాలి. ఎలా? ఆ యాస అర్థం కాదు. ఆ భాష అర్థం కాదు. మద్రాసీ హోటలతను ఇంగ్లీషులో సమాధానాలు చెప్పగలడు. బాగానే వుంది.

వేలవేల సంవత్సరాలుగా ఇలా చల్లగా సాగిపోతూనే వుంది గంగ. సాయంకాలం అదొక అద్భుతమైన అందమైన దృశ్యాలు గంగ వొడ్డున. ఎందరెందరో ఎన్నెన్ని భాషలవాళ్లో, ఆ మొహల్లో వింత ఉత్సాహం, సంతృప్తి, సంబరం. ఆకుదొన్నెల్లో దీపాలు వెలిగించి వదిలి పెడతారు. వెలుగులు, వెలుగులు, వరసలు, వరసలు, నీలాకాశం కింద నీలగంగ. దీపమాలికలు. ఒకదాని వెనక ఒకటి. గణగణ గణగణ గంటలు. గంగా మాయీ, నీకు దండాలు.జోతలు. చిరుచీకట్లు నీలితెరల్లా కిందికి దిగి వస్తాయి. హిమాలయ సుందరి పాదాల మణికట్లవరకూ జీరాడే జడలా నీలగంగ. అందులోనూ అది పువ్వులు కుట్టిన జడ. మురళి మనసంతా వివశమైంది. చదువుకునే రోజుల్లో వివేకానందుణ్ణి గురించి చదివాడు. రామతీర్థస్వామిని గురించి చదివాడు. పురాణాల్లో, కథల్లో, గాధల్లో, భారతంలో, రామాయణంలో గంగ, గంగ, గంగ. ఎన్నడు చూస్తాను. ఎన్నడు కళ్ళకద్దుకుంటాను దోసిట అని ఉబలాట పడేవాడు.

ఢిల్లీలో కాన్ఫరెన్సుకి వచ్చి పేపరు చదవాల్సిన అవసరం ఇన్నాళ్ళకి కలిగింది. హరిద్వారం వెళతానన్నాడు. మిత్రులు నవ్వారు. కళ్లు ప్రశ్నార్థకాలుగా పాతకాలపు భావాలను చూసి జాలిపడుతున్నట్లుగా చూశారు.

అయినా మురళి నిరుత్సాహ పడలేదు. గంగని చూడాలి. హరి ద్వారం వచ్చాడు.

తెలుగు తెలిసిన మిత్రుడెవరైనా తటస్థపడితే ఎంత బావుండును, అనుభూతులు కలబోసుకోవడానికి.

ఏమాశ్చర్యం. హరిద్వారంలో బస్సులు నిలిచే చోట ఎత్తుగా ఒక బోర్డుమీద తెలుగక్షరాలు. ప్రయాణీకులకు సూచనలు. హామీలు! ఫలానిచోట సత్రం వుంది. అందులో బస చేయడానికి అవకాశం వుంది.

ఇకనేం! మూటాముల్లే కట్టుకుని బయలుదేరాడు పొద్దున్నే.

"మాది గుంటూరు దగ్గర్లో పల్లెటూరండీ. హైదరాబాదులో పని చేస్తున్నాను. నాకు హిందీ సరిగా అర్థం కాదు. మీరు సహాయం చేయాలి."

"స్వామీ, ఈతణ్ణి మీ కప్పగిస్తాను. ఈపూట ఇతడితో గడపండి. దగ్గరున్న ప్రదేశాలు చూస్తానంటే వెంట వెళ్ళి చూపండి. పాపం, తెలీదంటున్నాడు కదా!" అని మురళి వెళ్ళి తిరుపతి దేవస్థానం వారి సత్రపు నిర్వాహకుడితో మనవి చేసుకోగా మురళి నాయన అక్కడున్న వొక స్వామికి అప్పగించాడు. ఋషీకేశ్‌లో తిరుపతి దేవస్థానం వారి సత్రం వుంది.

"స్వామీ, మీకు శ్రమ ఇస్తున్నాను. మన్నించాలి. నేను మళ్ళీ రేపే వెళ్ళిపోవాలి. అంచేత నాతో మీరు కూడా రాండి, గంగకు ఇద్దరీ అద్దరీ వున్న విశేషాలు చూపుదురుగాని" అని ప్రార్థించాడు మురళి.

ఆయన సరే నన్నారు.

ఆయనకు అరవై సంవత్సరాల వయసట. అయినా, అట్లా కనిపించరు. 'నాయనా ఇదుగో ఇది స్వర్గాశ్రమం. దీన్ని లక్ష్మణఝూలా అంటారు. ఇక్కడ కాళీకంబలి వాలా ఎంతమంది సాధులకైనా సదావర్తి ఇచ్చేవాడు. ఆయన గురువు విరజానందులు. ఆయన పుట్టు గుడ్డి. అయితేనేం, నూట ఎనిమిది ఉపనిషత్తులు ఆయనకు ముఖస్థం. ఇదుగో ఇక్కడే శివానందులు విశ్రమించేవారు. ఇక్కడ గంగ నీదుకొని అవతలకి వెళ్ళి రొట్టె తెచ్చుకొనేవారు. నవంబర్, డిసెంబర్ మాసాలు వచ్చేసరికి వాన కురిసినట్లు ఇక్కడ మంచు కురుస్తుంది. అన్నట్లు ఏ ఊరన్నావు నాయనా నీది?' అని మురళితోనే వుండి అక్కడి ప్రదేశాలన్నీ చూపారు స్వామి.

'స్వామీ, మీ స్వగ్రామం ఎక్కడ?'

'నాయనా మాకు స్వగ్రామం అంటూ వుండదు.'

'మీరే ప్రాంతం వారు?'

'అడిగిందే అడుగుతున్నావు!'

'మీ పేరడగవచ్చా?'

'కృష్ణానంద అంటారు.'

'మీరే వయస్సున సన్యసించారు?'

'ఇవన్నీ నీ కెందుకు నాయనా?'

'మిమ్మల్ని చూస్తే తెలుసుకోవాలని కుతూహలంగా వుంది. ఇంత చేరువుగా సన్నిహితంగా మీవంటి వారితో సంచరించగల అవకాశం మావంటి వాళ్ళకు లభ్యం కాదుగదా స్వామీ. అందువల్ల ననుకుంటాను, ఈ కుతూహలం.'

'తెలుసుకుని ఏం చేస్తావు?'

'తెలుసుకోవడమే పరమార్థం. నేను ఒక సంగతి మిమ్మల్ని అడుగుదామనుకుంటున్నాను. ఏమీ అనుకోవద్దు. రేపు ఎలాగూ వెళ్ళి పోతాను. ఇలాటి అవకాశం మళ్ళీ నా జన్మకు నాకు లభించదేమో-'

'అంతగా ప్రాధేయపడవలసిందేమీ లేదు ఇందులో.'

'ఈ ప్రపంచం దుఃఖపూరితమా - మీ దృష్టిలో?'

'ఏమిటలా అడుగుతున్నావు? ఆ మాట ఎవరంటారు నాయనా! ఎందు కనుకోవాలి? భగవంతుని సృష్టిలో దుఃఖమంటూ వుండటానికే వీల్లేదు.'

'మరి అయితే లోకంలో కనబడుతున్న బీభత్సాలన్నీనూ?'

'ప్రకృతి నియమాలను మీరడంవల్ల కన్పడే అవాంతరా లివన్నీనూ. శరీరానికి నొప్పి కలగదా? అప్పుడప్పుడూ కడుపు నొప్పి

వస్తుంది కదా అని మధురమయిన పదార్థాల నసలే తినకుండా మానే స్తామా! సృష్టి అంతా చాలా మనోహరమయింది నాయనా! పసిపాప బోసి నవ్వు, పువ్వులు, పళ్లూ, మనిషి గుండెలోని ఆర్ద్రత, ఉభయ సంధ్యలు, సూర్యచంద్రుల రంగుల వాకిళ్లూ.'

'మరయితే మీరివన్నీ ఎందుకు వదలుకున్నట్లు?'

'వదులుకున్నానా?'

'మరి ఈ పారిపోడాలు. కాషాయ వస్త్రాలు. తన వాళ్ళెవరూ లేరనడాలు-అందరూ నావాళ్ళే అనడాలూ ఇవన్నీ ఎందుకంట?'

స్వామి ముఖం మీద చిరునవ్వు వెలిగి వెలిసింది.

'సన్యాసుల నెవరూ కూడా పూర్వాశ్రమం సంగతు లడగ కూడదు - నీకు తెలుసో తెలీదోమరి.'

'నే నేదయినా తప్పుచేస్తే క్షమించండి. అందరినీ వదులుకొని అందరికీ దూరంగా వుంటూ ఏంసాధిద్దామని. ఎందుకు వదులుకోవాల్సి వచ్చింది! సృష్టికి యిది కాదు కదా ఆశయం?'

'నిజమే, నీవు మంచి ప్రశ్నే అడిగావు. భారతంలో ఏముందో తెలుసా? బంధనా లన్నింటికి పరమబంధనం కామం అని. అది వొక్కటీ వొదిలిపోయిందా - చుట్టుముట్టిన మేఘాలన్నీ చెదిరిపోయిన నిండు చంద్రుడిలా వుంటుంది ఆత్మ అని కాబోలనుకున్నాను. సాధనకు పూనుకుందామనిపించింది. సాధనచేస్తూనే వున్నాను.'

సాధించారా స్వామీ?'

'అని ఎలా అనగలను?'

'జీవితంలో ఏదో బలవత్తరమయిన సంఘటన వుండివుండక పోతే ఎవరయినా అన్నిటినీ వొదులుకో గలరా?'

* * *

'ఏమిటో అనుకోకుండా నీతో నాచిన్ననాటి జీవితం చెప్పేశాను. నలభయి సంవత్సరాలనాటి మైమాటే నేను మా ఊరును వదిలివేసి. మా వాళ్ళంతా ఏమయిపోయారో నాకు తెలియదు. ఇదొక ప్రపంచం. ఇందునా కష్టాలూ కలతలూ వున్నాయి. అయినా నిరంతరమూ సాగిపోతూ ఉండవలసిందే. జీవితంలో బలమయిన సంఘటన ఏదో వుండాలన్నావుకదూ? అది నిజమే! మా మాణిక్యం ప్రమాదకరమయిన పరిస్థితులలో చనిపోయింది. అప్పుడా అమ్మాయి కడుపుతో వుంది. సూడిదలకు యింటికి తీసుకొని వచ్చారు. తరువాత ఆ అమ్మాయి అత్తవారింటి కెళ్ళింది. అప్పటికే పుట్టింటివాళ్ళ సిరి తొలగిపోతూ వచ్చింది. తండ్రి ఆస్తి నంతా అమ్మి పత్తి వ్యాపారంలో పెట్టాడు. బాగా నష్టం వచ్చింది. మాణిక్యం తరువాత ఎనిమిదేళ్ళకు పుట్టిన ఒక్కగానొక్క నలుసూ చనిపోయాడు పుట్టింటి వాళ్ళు దరిద్రులయి పోవడంతో అత్తగారు కోడలిని ఆరళ్లు పెట్టారు. ఊరంతా అనుకున్నారు ఎంత మటుకు నిజమోమరి! మాణిక్యాన్ని అటకమీద కెక్కించి, అత్తారింట్లో వాళ్ళు కిందికి తోసేశారనీ. అవాళ నేను ఊళ్లోనే వున్నాను, ఆ కబురు తెలిసిన రోజున. అవాళ అత్త నా వొళ్ళో తల పెట్టుకుని ఎంతగా ఏడ్చిందో-నేను భరించలేకపోయినాను. నేనొక మనిషాతను, మాణిక్యం నాకెలాగూ దక్కలేదు. పోనీ, నాకళ్ళముందు సుఖంగానైనా లేదు. ఎందుకిలా జరిగింది? ఏమిటి దీనికి కారణం? నిజంగానే జన్మా పునర్జన్మా అంటూ వున్నాయా! వీటి సమాధానాల అన్వేషణతో ఊరు విడిచి వచ్చేశాను' అన్నారు స్వామి. గంగ సాగిపోతూనే వుంది.

(మూసీ - 1980)